
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 1 సెప్టెంబరు 2025



లడ్డూవేలం రూ.1,12,016


గద్వాల రాజవీధిలో లక్ష్మీనారాయణకు లడ్డూను అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

7

నల్లా బిల్లులు వసూలయ్యేనా..?

- వనపర్తి జిల్లాలో పేరుకుపోతున్న నల్లా బిల్లులు
- అధికారుల నిర్లక్ష్యంతో రూ.కోట్లల్లో బకాయిలు
- జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో ఇదే పరిస్థితి
- ఆర్థిక సంవత్సరం ముగింపు వరకే హడావిడి
- అక్రమ కనెక్షన్లపై అధికారుల ఉదాసీనత


వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నీటి సరఫరాలో జాప్యం జరిగితే మునిసిపల్ సిబ్బందిపై ప్రతాపాన్ని చూపే ప్రజలు నీటి బిల్లులను చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ తదితర పన్నులను జబర్దస్తీగా వసూలు చేస్తున్న మునిసిపల్ యంత్రాంగం నల్లాబిల్లుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు నెలలోనే అధికారులు హడావిడి చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో వసూలు చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ఐదు మునిసిపాలిటీల్లో కలిపి దాదాపు రూ.6 కోట్లకు పైగా నల్లా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



ఐదు మునిసిపాలిటీల్లో 20,582 నల్లా కనెక్షన్లు

జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత ఐదు మునిసిపాలిటీల్లో కలిపి 20,582 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నివాస గృహాలకు నెలకు రూ. 150, వాణిజ్య కనెక్షన్లకు అదనంగా వసూలు చేయాల్సి ఉంటుంది. అపార్ట్‌మెంట్ కనెక్షన్లకు ప్రత్యేక చార్జీలు ఉన్నా.. ఆదిశగా అధికారులు ప్రయత్నాలు చేయడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యా ప్తంగా 20,582 కనెక్షన్లకు గాను రూ. 6,17,74,000 వసూలు చేయాల్సి ఉంది.

మునిసిపాలిటీల తీరు ఇలా...

జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలలో ప్రధానమైన మునిసిపాలిటీ వనపర్తి. ఇక్కడ 10,152 నల్లా కనెక్షన్లు ఉండగా రూ. 6 కోట్లు నల్లా బిల్లులు బకాయి ఉంది. ఆత్మకూర్ మునిసిపాలిటీ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పెబ్బేరు మునిసి పాలిటిలో 2,715 కనెక్షన్లకు గాను రూ. 17 లక్షల 74 వేలు, కొత్తకోటలో 3,063 కనెక్షనకు గాను రూ.20 లక్షల 1540, అమరచింతలో 2200 కనెక్షన్లకు గాను రూ.2 లక్షల నల్లా బిల్లులు వసూలు చేయాల్సి ఉంది.

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం



నల్లా బిల్లుల వసూలు విషయంలో కాస్త వెనుక బాటులో ఉండటం వాస్తవమే. నేను కమిషనర్‌గా వనపర్తికి వచ్చిన కొత్తలోనే దాదాపు కోటి రూపాయలకు పైగా వసూల్ చేయించాం. మొండి బకాయిలను వసూలు చేయాల్సి ఉంది. బకాయి బిల్లుల వసూలు కోసం త్వరలోనే కలెక్టర్ అనుమతి తీసుకుని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం. - వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్, వనపర్తి


డిస్కస్‌త్రోలో బంగారం, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలు సాధించిన పౌర్ణమితో శాంతికుమార్


జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి
- జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్
- ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో నిర్వహిస్తున్న జి. రాజేంద్ర ప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి జిల్లా వాలీబాల్

- మిగతా 6లో..


అండర్-16 బాలుర చాంపియన్‌షిప్ రంగారెడ్డి జట్టు



మబ్బులకు పసిడి వన్నె కిరీటం!

సాయం సంధ్యవేళ ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకున్నాయి. సూర్యుడు మబ్బుల చాటుకు తప్పుకుంటుండగా, పసిడి వన్నె కిరణాలు పడి ఆకాశం కొత్త అందాలను సంతరించుకున్నది. ప్రకృతి గీసిన వర్ణ చిత్రంలాంటి ఈ దృశ్యం జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని చెన్ని పాడు శివారులో ఆదివారం కనువిందు చేసింది. 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

- అలంపూరుచౌరస్తా (ఆంధ్రజ్యోతి)

గద్వాలలో నిలిచిన అభివృద్ధి

- నామీద కోపంతో నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలో కలిపారు
- మళ్లీ మహబూబ్‌నగర్‌లో కలుపుతాం
- తపస్ గురువందనం కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ


మాట్లాడుతున్న పాలమూరు ఎంపీ డీకే అరుణ

గద్వాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో గద్వాల అభివృద్ధి ఇరవైఏళ్లు వెనక్కి వెళ్లింది. తాను చేసిన అభివృద్ధి తప్ప ఇప్పుడేమీ కనిపించడం లేదని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలో ఏర్పాటు చేసిన తపస్ గురువందనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గద్వాల అభివృద్ధికి కేరాఫ్‌గా ఉండేంది. ఇప్పుడు ఎక్కడ చూసినా గుంతలమయం అయిన రోడ్లే దర్శనం ఇస్తున్నాయి అని అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా, పార్టీ బాధ్యతల వలన గద్వాలకు దూరం అయ్యానని తెలిపారు. ఇక నుంచి 15రోజులకోసారి గద్వాలకు వస్తానని, ఇక్కడ ఆగిపోయిన అభివృద్ధిని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఉండే గద్వాలను ఓ పెద్ద నాయకుడు నామీద కోపంతో నాగర్‌కర్నూల్ ఎంపీ నియోజకవర్గంలో కలిపారన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజనలో మళ్లీ మహబూబ్‌నగర్‌లో కలిపేస్తానని హామీ ఇచ్చారు. గురువులు సమాజంలో మార్గనిర్దేశకులని సమాజాన్ని సన్మార్గంలో నడిపించి విద్యను విజ్ఞానాన్ని నేర్పించి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ పనితీరు బేష్‌గా ఉందని కితాబిచ్చారు. ఇద్దరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను ఎన్నుకునే శక్తి తపస్‌కు ఉందని అన్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు, జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

వివాహిత హత్య

- పరారీలో భర్త
- గోపాల్‌పేట మండలంలో ఘటన


హత్య జరిగిన ఇంటి వద్ద డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణ, ఎస్ఐ నరేశ్


మహమూదా (ఫైల్)

గోపాల్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని పొలికేపాడు గ్రామంలో ఓ వివాహిత హత్యకు గురయ్యింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ చోటామియ్యా మహమూదా (50) దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు అయిపోయి, హైదరాబాద్‌లో ఉంటున్నారు. భార్యాభర్తలిద్దరూ గ్రామంలో ఉంటున్నారు. భర్త చోటామియా కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కర్నూలు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చికిత్స చేయించింది. ఈ నెల 30వ తేదీన శనివారం రాత్రి గ్రామంలోని ఒక కల్లు దుకాణంలో చోటామియా కల్లు తాగుతుండగా భార్య అడ్డుకున్నది. కల్లు తాగొద్దంటూ గొడవ పడింది. ఆ తర్వాత ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. మరుసటి రోజు ఉదయం 7గంటలు దాటినా వారి ఇంటి తలుపులు మూసి ఉండటంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చింది. దీంతో తలుపులు తెరిచి చూడగా, మంచం మీద రక్తపు మడుగులో మహముదా మృతదేహం కనిపించింది. కత్తితో గొంతు కోసిన ఆనవాళ్లున్నాయి. ఇంట్లో భర్త చోటా మియా కనిపించలేదు. సంఘటనపై స్థానికులు సమాచారం అందించడంతో ఎస్ఐ నరేశ్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం వారు ఆధారాలు సేకరించారు. పోలీసు జాగిలం గ్రామ శివారులో ఉన్న నల్లకుంట వరకు వెళ్లి ఆగిపోయింది. గ్రామస్థులు భర్తపైనే అనుమానం వ్యక్తం చేశారు. అతడి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

కృష్ణానదిలో హైకోర్టు జడ్జి కుమారుడి అస్థికల నిమజ్జనం


హైకోర్టు జడ్జి కుమారుడి అస్థికల నిమజ్జన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు

ఎర్రవల్లి, ఆగస్టు, 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి మధుసూదన్‌రావు కుమారుడు కౌశిక్ ఆరు రోజుల క్రితం మరణించారు. దీంతో కృష్ణానదిలో ఆయన అస్థికలను కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మండలంలోని బీచుపల్లి వద్ద కృష్ణానదిలో కలిపారు. పురోహితుడు అనిల్‌శర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.



రాయలసీమకు తరలుతున్న యూరియా

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం వద్ద కృష్ణానది తీరంలో బోటులో యూరియా బస్తాలను తరలిస్తున్న రాయలసీమ దళారులు

6

గంజాయి విక్రయాలపై పోలీసుల పంజా..

- జిల్లాలో గంజాయి నివారణే లక్ష్యంగా తనిఖీలు
- ఇప్పటికే రెండు కేసుల్లో నలుగురి అరెస్ట్
- 1,650 గ్రాముల గంజాయి స్వాధీనం



గంజాయిని సరఫరా చేసేవారిని అరెస్ట్ చేసి విలేకరుల ముందు హాజరు పరిచిన డీఎస్పీ మొగులయ్య (ఫైల్)

గద్వాలక్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):జోగుళాంబ గద్వాల జిల్లా గంజాయికి అడ్డాగా మారింది. మైనర్లు గంజాయికి బానిసలుగా మారుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని కొందరు పెట్లర్స్ (డ్రగ్స్‌ను కొనుగోలు చేసేవారు) తమ కింద కొందరు యువకులు తెచ్చిన డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పెట్లర్స్ ఇతర ప్రాంతాలనుంచి డ్రగ్స్‌ను తెస్తూ యువతను పెడదారిన పట్టిస్తూ లక్షలకు లక్షలు గడిస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ముఖ్యంగా జిల్లా కేంద్రంలో యువత గంజాయి సిగరెట్లను అలవాటు చేస్తున్నారు.

షోలాపూర్ నుంచి డ్రగ్స్ కొనుగోలు..

జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన పెట్లర్స్ ఎక్కువగా కర్ణాటక జిల్లాలోని షోలాపూర్ ప్రాంతం నుంచి ఎక్కువగా గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ ప్యాకెట్ల రూపంలో కొందరు యువతతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. షోలాపూర్‌లో ఒక్కోగ్రామ్ కేవలం రూ. 100కు తెచ్చి ఇక్కడ రూ. 600 నుంచి రూ.700కు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అలాగే రాయిచూర్, హైదరాబాద్, గోవా నుంచి గంజాయి సిగరేట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వీరు లక్షలు గడిస్తూ యువతకు, మైనర్లకు డ్రగ్స్‌ను అలవాటు చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. పోలీసులు నిఘా వేస్తే ఆయువ కులను పట్టుకుంటారే తప్ప వారి వెనుక ఉన్న పెట్లర్స్‌పై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. .

అయిజలో అరెస్ట్..

జిల్లా కేంద్రంలోని షేరెల్లివీధితో పాటు అయిజలో గంజాయి ప్యాకెట్లును విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వీరినుంచి జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలో ఈ గంజాయిని సరఫరా చేసే పెట్లర్స్ ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాత, కొత్త హౌసింగ్‌బోర్డులు, షెరెల్లివీధి, గంజిపేట, దౌదర్‌పల్లి, కిష్టారెడ్డిబంగ్లా కాలనీలలో ఈ పెట్లర్స్ సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్లర్స్‌పై పోలీసులు దృష్టిపెడితే వారిని కాపాడేందుకు వెంటనే కొందరు నేతలు ముందుకువస్తున్నట్లు తెలుస్తోంది. నేతల అండదండలు మెండుగా ఉండటంతోనే జిల్లా కేంద్రంలో డ్రగ్స్ వాడకాలు అధికమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి.

కేసులు నమోదు..

జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది గంజాయికి సంబంధించి ఒక కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయడంతో పాటు 18 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో రెండు కేసులను నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి 1,650 గ్రాములు గంజాయిని సీజ్ చేశారు.

గంజాయి రహిత జిల్లాగా గద్వాల



జోగుళాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. యువత గంజాయికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు నిఘా ఉంచాలి.

- శ్రీనివాసరావు, ఎస్పీ

ఎల్లూరు రిజర్వాయర్‌లో

30 కేజీల చేప లభ్యం

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు రిజర్వాయర్‌లో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. మత్స్యకారులు వేసిన వలకు 30 కేజీల బొచ్చ రకం చేప లభ్యం కావడంతో మత్స్యకారుడు పిట్టల వెంకటస్వామి ఆనందం సంబురపడ్డాడు. రిజర్వాయర్‌లో 20, 25, 15 కేజీల సైజులో బొచ్చ చేపలు పడ్డాయని మత్స్యకారుడు తెలిపారు. ఎగువ ప్రాంతంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు కృష్ణానదిలో నీరు నిండుగా ప్రవహిస్తుందని, దీంతో ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటి విడుదల జరుగుతుందని మత్స్యకారులు తెలిపారు.


ఎల్లూరు రిజర్వాయర్‌లో లభ్యమైన 30 కేజీల చేపతో మత్స్యకారుడు

ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలి

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి

7

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రచారం
- నేటి నుంచి పోషకాహార మాసోత్సవం


ఖిల్లాఘణపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్

6

వృద్ధురాలిపై దాడిచేసిన పోస్టుమన్‌పై కేసు నమోదు

7

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

ఏకదంతాయ.. వక్రతుండాయ



అచ్చంపేట పట్టణంలోని జూబ్లీనగర్ వినాయకుడిని విద్యుత్ కాంతుల నడుమ నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఏకదంతాయ.. వక్రతుండాయ..


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బోలా శంకరుని సమేతంగా దర్శమిస్తున్న వివేకనంద యూత్ వినాయకుడు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూరా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద జన సందడి నెలకొన్నది. వివిధ ఆకృతుల్లో, అలంకరణల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్యను భక్తులు దర్శించుకొని పూజలు చేస్తున్నారు.

\- నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి


మహబూబ్‌నగర్ జిల్లా గడియారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణేశుడు


సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో విఘ్నేశ్వరుని పాల రాతి విగ్రహం


మహబూబ్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద గణపతి


లింగంబావి సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


అమరచింత సంతోష్ నగర్‌లో పూజలు అందుకుంటున్న గణనాథుడు


నాగర్‌కర్నూల్‌లో సింహ వాహనంపై ఆసీనులై పూజలు అందుకుంటున్న మైల్‌స్టోన్ యూత్ వినాయకుడు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సూర్య భగవాన్ రథం ముందు ఆసీనులై దర్శమిస్తున్న సెలక్షన్ సిండికేట్ వినాయకుడు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శివతాండవ దేవతా మూర్తుల మధ్య పూజలు అందుకుంటున్న వీర శివాజీ యూత్ వినాయకుడు


మహబూబ్‌నగర్ భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిస్తున్న రెబల్ యూత్ వినాయకుడు

మైసమ్మ దేవతకు పూజలు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వనపర్తి జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి ఆదివారం టికెట్ల ద్వారా రూ.42,805, హుండీ ద్వారా రూ.40,820 మొత్తం రూ.83,625 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

జూపల్లిలో ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు


పెద్దమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న యాదవ కులస్థులు

చారకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లిలో యాదవ కులస్థుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలను యాదవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనం కుండలకు పసుపు, కుంకుమ, వేపాకులు, మామిడి తోరణాలతో అలంకరించారు. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని నృత్యాలు, పూనకంతో ఊగారు. యువతి, యువకులు నృత్యాలు చేసుకుంటు ఊరేగింపుగా రేణుకాఎల్లమ్మ దేవత ఆలయానికి చేరుకొని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, యాదవులు భిక్షపతియాదవ్, రాములుయాదవ్, జంగయ్య, మల్లయ్య, శ్రీను, లింగం, మల్లేష్, శ్రీరాములు, రాజుయాదవ్, కార్తిక్‌యాదవ్ పాల్గొన్నారు.

కోతకు గురైన సీసీ రోడ్డు


సిర్సవాడలో మాదారం వెళ్లే రహదారిపై కోతకు గురైన సీసీ రోడ్డు

తాడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడలో మాదారం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న సీసీ రోడ్డు ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కోతకు గురైంది. దుందుభీ నది సమీపంలో ఈ సీసీ రోడ్డు పూర్తిగా కోతకు గురై విరిగిపోయే పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రహదారులను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ప్రధానంగా రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలు పూర్తిగా దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం
- నేటి నుంచి పోషకాహార మాసోత్సవం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తిండి కలిగితేనే కండ కలదోయే.. కండ కలవాడే మనిషోయ్.. అని మహాకవి గురజాడ అప్పారావు వర్ణించినట్టుగా ప్రస్తుత సమాజంలోని మనుషులు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. పట్టణాల్లో, పల్లెల్లో అనే తేడా లేకుండా అవగాహన లోపంతో మధుమేహం, రక్తపోటు, గుండె, జబ్బులాంటి అనారోగ్యాలకు గురవతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం పౌష్టికాహారం లోపంతో మాతా, శిశు మరణాలు, బరువు తక్కువ పిల్లలు జన్మిస్తున్నారని నిర్ధారించారు. వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పౌష్టికాహార మిషన్‌ను ప్రారంభించింది. ప్రతీ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార ప్రాధాన్యం, రక్తహీనత సమస్యల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గృహ సందర్శన చేసి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపంతో ఏడాదికి చాలా మంది చిన్నారులు, పెద్దలు, బాలింతలు చనిపోతున్నారు. మనం


పోషక పదార్థాలతో అవగాహన కార్యక్రమం

తినే ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన పరిపూర్ణ ఆహారంతో రోగాలు దూరం అవుతాయి. కూరగాయలు పండ్లు, పప్పు దినుసులు, గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలువలు, జీడిపప్పు బాదం, వాల్ నట్స్ ఇతర వంటకాల్లో పౌష్టికాహారం లభిస్తుంది. మనం తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు, చక్కెర, ఉప్పు, మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిది.

పోషణ అభియాన్...

2018 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ పోషణ్ అభి



అంగన్‌వాడీ కేంద్రంలో పోషక కూరగాయలతో కూడిన వెయ్యి రోజుల ప్రాముఖ్యత తెలిపే ప్రదర్శన

యాన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం లోపం లేకుండా చేయడమే పోషణ్ అభియాన్ లక్ష్యంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ 6 నెలలకు ఒకసారి పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సెప్టెంబరు మాసంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రతీరోజు పోషకాహారానికి సంబంధించి ఒక్కో అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ర్యాలీలు, సమీక్షలు, గృహ సందర్శన క్షేత్రస్థాయిలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్‌లో ఫోటోలను పొందుపరుస్తారు. పోషక మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 2 సంవత్సరాల వరకు మొత్తం 1000 రోజుల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం అందే విధంగా చర్యలు చేపడుతారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువు, ఎత్తులను నమోదు చేస్తూ వ్యత్యాసాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి సూచనలు సలహాలు అందిస్తారు.

వనపర్తిని పోషక లోప రహిత జిల్లాగా మార్చుదాం



జిల్లాను పోషక లోప రహిత జిల్లాగా మార్పు చేద్దామని పిలుపునిచ్చారు. మహిళల్లో రక్త హీనత సమస్య లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతల గృహ సందర్శన చేసి కుటుంబ సభ్యులకు పోషకాహారంపై సూచనలు చేస్తున్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువుల ప్రగతిని నమోదు చేస్తాం. 1,000 రోజుల ప్రాముఖ్యత తెలుపుతూ పోషక మాసోత్సవంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

\- సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారి, వనపర్తి

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

(5వపేజీ తరువాయి)

సంఘం అధ్యక్షుడు శాంతికుమార్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌లు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. రాష్ట్ర క్రీడాకారులు ఒలంపిక్ స్థాయికి ఉదగాలని ఆకాంక్షించారు. రాజేంద్రప్రసాద్ పేరిట రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టోనీమార్టిన్, శరత్‌చంద్ర, ట్రెజరర్ ఆనంద్‌కుమార్, కోచ్ సునీల్, పీడీలు రమణ, పి.శ్రీనివాసులు. సి.శ్రీనివాసులు. రాఘవేందర్, రమేష్‌బాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


టోర్నీలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఖమ్మం క్రీడాకారులు


అండర్-16 బాలికల చాంపియన్‌షిప్ హన్మకొండ

విజేతలు వీరే.....

ఓవరాల్ చాంపియన్ ఖమ్మం మరియు బాలికల అండర్-20 చాంపియన్ షిప్ మహబూబ్‌నగర్

చాంపియన్‌షిప్ విజేతల వివరాలు ఇలా..

ఓవరాల్ చాంపియన్‌షిప్ ఖమ్మం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. అండర్-20 బాలికల విభాగంలో 20 పాయింట్లతో మహబూబ్‌నగర్ జట్టు, బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు 28 పాయింట్లతో చాంపియన్‌షిప్‌గా నిలిచాయి.

అండర్-16 బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు, బాలికల విభాగంలో హన్మకొండ జట్టు, అండర్-18 బాలుర విభాగంలో ఖమ్మం, బాలికల విభాగంలో హైదరాబాద్ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో జిల్లా అథ్లెట్ పౌర్ణమి స్వర్ణ, షాట్ ఫుట్‌లో కాంస్య పతకం అందుకుంది.

ఏడు యూనిట్లలో జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో యూనిట్ల ద్వారానే విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 3.561 మిల్లియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 265.643 మిల్లియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జ్వరాలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఒక్క యూనిట్ మాత్రమే ప్రారంభించి 3.16 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 295.523 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. కృష్ణా నది ద్వారా అత్యధికంగా వరద వస్తుండడంతో ఉత్పత్తి అనంతరం దిగువకు నీరు సులభతరంగా వెళ్లక బ్యాక్ వాటర్‌గా నిలిచిపోవడంతో ఆరు యూనిట్లను ప్రారంభించడం సాధ్యపడకపోవడంతో ఒక్క యూనిట్‌ను మాత్రమే ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. వరద ఇదే మాదిరిగానే కొనసాగితే త్వరలోనే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

యూరియా కొరతను నివారించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ కుంభం మల్లేష్‌గౌడ్


సమావేశంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేసి తెలంగాణలో యూరియా కొరత లేకుండా చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఈ వానాకాలం వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు విస్తృతంగా పండిస్తున్నారన్నారు. ఈ పంటలు ఏపుగా పెరిగేందుకు రైతులు యూరియాతో పాటు నైట్రోజన్ ఎరువుపై ఎక్కువగా ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడం, సాగునీటి ప్రాజెక్టుల్లోకి సరిపడా నీరు రావడంతో ఈ సారి రైతులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 118 లక్షల ఎకరాల్లో పటలు సాగు చేశారన్నారు. గతేడాది కంటే 27 శాతం అధికంగా పంటలు సాగు చేయడం కారణంగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, నాయకులు నిరంజన్‌యాదవ్, సుధాకర్‌గౌడ్, గంగోజీ, పబ్బతి శ్రీనివాసులు, రవీందర్‌గౌడ్, కొత్త శ్రీనివాసులు, రాజు, చైతన్య పాల్గొన్నారు.

రాయలసీమకు తరలి వెళ్తున్న యూరియా


ఆటోలో కృష్ణానది ఒడ్డుకు తీసుకొచ్చిన యూరియా సంచులు

పెంట్లవెల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం, మంచాలకట్ట కృష్ణానది మీదుగా మరబోటులో రాయలసీమ ప్రాంతానికి యూరియా బస్తాలను తరలిస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలోని సొసైటీల ద్వారా స్థానికంగా ఉండే రైతుల ద్వారా పేరు నమోదు చేయించుకొని యూరియా బస్తాలను రాయలసీమ దళారులకు అమ్ముకుంటున్నారు. మంచాలకట్ట నుంచి కొండపాటూరు, కొణిదెల, ముచ్చుమర్రి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అదే విధంగా మల్లేశ్వరం నుంచి కపిలేశ్వరం, మాడుగుల, కొత్తపల్లి గ్రామాలకు యూరియా తరలిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో యురియా కొరత ఏర్పడి స్థానికంగా ఉండే రైతులకు అందక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో తెలంగాణ నుంచి రాయలసీమ ప్రాంతానికి యూరియాను తరలిస్తున్నారు.

బైక్ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

గోపాల్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బైక్ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన వెంకటయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. వడ్డేగేరి కాలనీకి చెందిన చిన్నబాబు బైక్‌పై పోచమ్మ ఆలయం నుంచి కల్లు దుకాణం రోడ్డుకు వస్తూ.. వెంకటయ్యను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వారిని వనపర్తి ఆసుపత్రికి తరలించారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

- » నాపై 181 కేసులు బనాయించారు
- » ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
- » చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
- » 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
- » 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

- » 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
- » 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
- » కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

చిన్నంబావి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో నారాయణ కల్లందొడ్డిలో ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల భార్య చనిపోవడంతో మనస్థాపానికి గురైనట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మద్దూర్‌లో గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ప్యాకెట్లు

మద్దూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణ పేట జిల్లా మద్దూర్‌లో ప లు కిరాణ షాపుల్లో పో లీసులు ఆదివారం తనిఖీ చేపట్టారు. పట్టణంలోని సీఆర్ కిరాణంలో విక్రయా నికి నిల్వ ఉంచిన రూ. 15,235 విలువ గల గుట్కా, జర్దా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్.ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిషేధిత గుట్కను విక్రయిస్తున్న యజమాని విష్ణుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మరికల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీలేరు స్టేజీ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన ఉపేంద్ర బైక్‌పై మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో తీలేరు స్టేజీ సమీపంలో లారీ, బొలెరో, బైక్ వరసగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఉపేంద్ర ఎగిరి పడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరాలపై దాడులు

- ఐదుగురి అరెస్ట్

కృష్ణ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరాలపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.14,200 నగదు, పేకాట ముక్కలు స్వాధీన పరుచుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని చేగుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం అందుకుని మధ్యాహ్నం ఎస్ఐ నవీద్, సిబ్బందితో కలిసి స్థావరాలపై దాడులు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు చెందిన ఐదుగురిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై దాడిచేసిన పోస్టుమన్‌పై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలిపై దాడి చేసిన పోస్టుమన్ షేక్ గులాంనబీపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మానవ పాడు మండలం చెన్నిపాడుకు చెందిన వృద్ధురాలు పద్మావతమ్మపై శనివారం దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆమె, కుమారుడు సంపత్‌కుమార్‌తో కలిసి పోలీసులను ఆశ్రయించింది. తనపై అకారణంగా దాడి చేసి నెట్టివేశారని, అనారోగ్యంతో ఉన్న నేను కుప్ప కూలిపోయాయని తెలిపింది. దాడిచేసిన షేక్ గులాంనబీ పై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు.

రాజవీధిలో లడ్డూవేలం రూ.1,12,016



వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



లడ్డూను దక్కించుకున్న ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు

గద్వాల టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం ఐదవ రోజు స్థానిక రాజవీధిలోని శ్రీభక్త మార్కండేయస్వామి అలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడి లడ్డూకి వేలంపాట నిర్వహించారు. పద్మశాలి యువజన సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి, చేనేత వ్యాపారి బిజ్జి లక్ష్మీనారాయణ రూ.1,12,016లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి పట్టణ సేవాసంఘం అధ్యక్షుడు నామాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సాయిబాబ, యువజన సంఘం అధ్యక్షుడు అక్కల కుమార్, పద్మశాలి కులబాంధవులు, మహిళలు ఉన్నారు.

గణనాథుడి లడ్డూ వేలం రూ.99,999

ఉప్పునుంతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూకు ఆదివారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొని రూ. 99,999కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడి విగ్రహాన్ని గ్రా మ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ స భ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డితో పాటు కమిటీ సభ్యు లు ఉన్నారు.

వేలంలో లడ్డూ రూ. 30,116

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలోని వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో ఆదివారం నిర్వహించిన పెద్దలడ్డూను పద్మ, చిరంజీవి దంపతులు రూ.30,116కు వేలంపాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే చిన్నలడ్డును వాణి, శివకుమార్ రూ. 8,616కు వేలంపాట పాడి దక్కించుకోగా కలశం, చెంబును రూ.2,516లకు జయలక్ష్మి, నర్సన్‌గౌడు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలుగు నర్సింహులు, చిరు ముదిరాజ్, వీరేశ్, చెన్నకేశవులు, హనుమంతు, వెంకటేశ్‌శెట్టి పాల్గొన్నారు.

పీయూ తెలుగు శాఖ అధ్యక్షుడిగా మార్క్‌పోలోనియస్

» కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవకాశం



తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్‌కు నియామక పత్రం అందజేస్తున్న విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్‌ను నియమిస్తూ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య రమేష్ కుమార్‌లు ఆదివారం నియామక పత్రం అందజేశారు. తెలుగు శాఖ అధ్యక్షుడిగా వీరు రెండేళ్ల పాటు కొనసాగుతున్నారు. ప్రస్తుతం వీరు పాలమూరు యూనివర్సిటీ పీ జీ సెంటర్ కొల్లాపూర్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. వీరు గతంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పోస్ట్ డాక్టరల్ యూజీసీ ఫెలోషిప్, తెలంగాణ రాష్ట్ర తె లుగు సాహిత్య అవార్డు అందుకున్నారు.

మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ట్ మెంటర్‌గా, గద్వాల పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఈయన దగ్గర ప్రస్తుతం నలుగురు రీసెర్చ్ స్కాలర్స్ పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈయన జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు చైర్మన్‌గా వ్యవహరించారు. ఈయన నియామకంపై అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలి

» ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులకు పనిభారం తగ్గించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు పనిభారంతో సతమతమవుతున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించడం వల్ల నిర్వహణలో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని వెంటనే ఆర్టీసీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, ప్రేమలత, సుమలత, వెంకటేష్, చింతలయ్య, అయూబ్, అర్జున్ పాల్గొన్నారు.

దాడి చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు

వెల్దండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కాసోజీ అనూష ఆమె తల్లి రుక్మిణిపై దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన అపర్ణ ఆమె భర్త తిరుమల్‌రావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ కురుమూర్తి తెలిపారు. కొంత కాలంగా వారి మధ్య నెలకొన్న గొడవల నేపథ్యంలో అపర్ణ, తిరుమల్‌రావులు ఆదివారం ఉదయం అనూష ఇంట్లోకి వెళ్లి ఆమెపై దాడి చేసి గాయపరిచారని, బాధితురాలు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అర్బన్ నక్సలైట్ అనడం తగదు

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి అభ్యర్థి, రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అర్బన్ నక్సలైట్‌గా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనడం దుర్మార్గమని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రజాస్వామిక వాదులు, పౌర ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చర్చాగోష్టిలో పాల్గొని మాట్లాడారు. మాట్లాడేవారందరినీ ఏదో నెపంతో వేధింపులకు గురిచేయడం బీజేపీ పాలనలో పరిపాటి అయ్యిందని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎంపీలు డీకే అరుణ, పార్థసారథిరెడ్డి, మల్లురవి రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌గౌడ్‌కు ఓటు వేయాలని డిమాండ్ చేశారు. పౌర ప్రజా సమూహాలు ఎక్కడికక్కడ ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి బరిలో నిలిచిన సుదర్శన్‌రెడ్డి ఆదర్శవంతమైన ప్రజాస్వామిక వాది అన్నారు. పార్టీలకతీతంగా, ప్రజాస్వామిక వాదులంతా ఆయనకు సంఘీభావంగా నిలబడడం ఆదర్శనీయమన్నారు.

సమావేశంలో సామాజికవేత్త హనీఫ్, విద్యావంతుల వేదిక నాయకులు సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఖలీల్, ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, సీపీఐ నాయకుడు సురేశ్, ప్రజా సంఘాల నాయకులు వామన్‌కుమార్, కేసీ వెంకటేశ్, ఫారుఖ్‌హుస్సేన్, శ్రీదేవి, ఆయూబ్, బాబర్‌షేక్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల ఆందోళనకు స్పందించిన అధికారులు

- పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం

వెల్దండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తమ పాఠశాలలో అవసరమైనమేరకు ఉపాధ్యాయులు లేరని, చదువులు సాగడంలేదని, తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌చేస్తూ శనివారం మండలంలోని అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు చేసిన ఆందోళకు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి ఆదేశానుసారం అమ్రాబాద్ నుంచి ఉర్దూమీడియం ఉన్నత పాఠశాల నుంచి స్కూల్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, వెల్దండ ఉన్నతపాఠశాల నుంచి స్కూల్ అసిస్టెంట్లు అశోక్, సాజిదాలను నియమించినట్లు ఎంఈవో చంద్రుడునాయక్ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

'పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి'

ఉప్పునుంతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలకు పాత ఇళ్లు శిథిలావస్థలో ఉండి కూలిపోయి నిరాశ్రయులైన పేదలకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక పాలన లేక అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎం మండల నాయకుడు సైదులు, సీఐటీయూ నాయకులు గందసిరి, మనోహర్, హరీష్, రైతు సంఘం నాయకులు శ్రీను, రాజు ఉన్నారు.

వెల్టూరు సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలి

- కాంగ్రెస్ నాయకుడు బాలరాజు

ఉప్పునుంతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వెల్టూరు గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించాలని యువజన కాంగ్రెస్ నాయకుడు బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు సర్పంచ్ స్థానం ఎస్సీ రిజర్వేషన్ రాలేదని ఆయన గుర్తు చేశారు. గ్రామంలో సామాజిక వర్గం పరంగా చూసిన దళితుల ఓట్ల జనాభా ఎక్కువగా ఉంటుందన్నారు.

'ఓటరు లిస్టులో తప్పులను సవరించాలి'

వంగూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓటరు లిస్టులో ఉన్న తప్పులను అధికారులు వెంటనే సరిచేయాలని కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు లిస్టులో మండల వ్యాప్తంగా అవకతవకలు ఉన్నాయని అధికారుల దృష్టికి తెచ్చామని తెలిపారు. వెంటనే రెండు, మూడు పర్యాయాలు ఓటర్ల పేర్లు నమోదయ్యాయని, వీటిని పరిశీలించి సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాలు

చారకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేపల్లి గ్రామంలో రేణుకాఎల్లమ్మ దేవాలయపునఃనిర్మాణానికి పలువురు నాయకులు ఆదివారం విరాళాలు అందజేశారు. జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ రూ. 25వేలు, మాడ్గుల మండలం సుద్దపల్లి మాజీ సర్పంచ్ రూ. లక్షా 11వేలు, జేపల్లి గ్రామానికి చెందిన మల్లెపాకుల వెంకటయ్య రూ. 10 వేలు, అదే విధంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దేవాలయ నిర్మాణానికి స్టీలు, సిమెంట్‌ను విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు : ఎస్ఐ

కల్వకుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనాలల్లో డీజేలకు అనుమతి లేదని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినాయక నిమజ్జనాల కోసం డీజేలకు, సిట్టింగ్ డీజేలు, సింగిల్‌పిన్ డీజేలకు కూడా పర్మిషన్ లేదని, ఒకవేళ ఎవరైనా డీజేలకు అడ్వాన్స్‌లు ఇస్తే నిర్వాహకులు నష్టపోతారన్నారు. నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు

వంగూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాజాల తండాను ఆదివారం యువజన కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడు క్యామ మల్లయ్య సందర్శించారు. తండాలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంలో మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిని ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన మల్లయ్య సొంత ఖర్చుతో రోడ్డుకు మట్టిపోసి మరమ్మతు చేయించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

సొంత నిధులతో గంగారం చెరువుకు మరమ్మతులు

బిజినేపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామంలోని పెద్ద చెరువుకట్టకు మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి సొంత ఖర్చులతో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల వరద ఉధృతికి చెరువు నిండి కట్టకు లీకేజీలు ఏర్పడి తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు పనులు చేయించారు. దాదాపు వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా రైతులు వరి సాగు చేపట్టారు. 15 రోజులుగా కురిసిన వర్షాలకు నీట మునిగి వరిపంట ఇప్పుడిప్పుడే నీటిలో నుంచి బయటకు తేలింది. శేఖర్ రెడ్డి స్పందించి ఎక్సావేటర్‌తో పనులు చేపట్టారు.

లంబోదరా.. మము దీవించవా

- పూజలందుకుంటున్న వినాయకుడు - కొనసాగుతున్న భజనలు, అన్నదానాలు
- ఐదో రోజు పలు చోట్ల నిమజ్జనం - పటిష్టమైన పోలీసు బందోబస్తు

కందనూలు/ కల్వకుర్తి/ వెల్దండ/ నాగర్‌కర్నూల్‌టౌన్/ అచ్చంపేట/ తాడూరు/ తిమ్మాజీపేట/ అమ్రాబాద్/ పెద్దకొత్తపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు 25 వసంతాలు పూర్తి చేసుకుని బోలా శంకరుని సమేతంగా దర్శనమిస్తూ పూజలు అందుకుంటున్నాడు. రాఘవేంద్ర కాలనీలో వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలోశివతాండవ దేవతామూర్తుల మధ్య దర్శనమిస్తూ పూజలు అందుకుంటున్నాడు. హౌసింగ్ బోర్డుకాలనీలో రెబల్ యూత్ ఆధ్వర్యంలో కొలు వైన వినాయకుడు శ్రీదేవి, భూదేవి సమేతంగా దశావతార రూపాల్లో దర్శమిస్తూ భక్తులను ఆకట్టుకుంటుండగా మైల్‌స్టోన్ యూత్ ఆధ్వర్యం లో కొలువైన వినాయకుడు సింహ వహనంపై ఆసీనులై నిత్య పూజలు అందుకుంటున్నాడు. సంతబజారులో సెలక్షన్ సిండికేట్ ఆధ్వర్యంలో సూర్యభగవాన్ రథం ముందు ఆసీనులైన వినాయకుడు భక్తులకు దర్శమిస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాల్లో వినాయక మండపాల్లో భక్తులు సందడి కనిపిస్తోంది. నవరాత్రుల పాటు పూజలు అందుకోనున్న వినాయకుడు ఈ నెల 4న నిమజ్జనం చేసేందుకు ఆయా యువజన సంఘాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ● జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పా టు చేసిన గణపతి విగ్రహం దగ్గర ఆదివారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ● కల్వకుర్తిలో వేపచెట్టు వద్ద, పోస్టాఫీ సు వద్ద, గాంధీనగర్ కాలనీలో గణ నాథులకు మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ ప్రత్యేక పూజలు ని ర్వహించారు. ● వెల్దండలోని 4వ వార్డులో వినాయకుడికి స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ● అచ్చంపేటలో ఐదురోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న లంబోదరుడికి ఆదివారం సాయంత్రం అచ్చం పేట పట్టణ సమీపంలోని తాడూరి చెరువులో నిమజ్జనం చేశారు. ● తాడూరు మండలంలోని గ్రామాల్లో వినాయకునికి ఐదవ రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్సవాడలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని గణనాథునికి మహమ్మద్ జాంగీర్ 5కిలోల లడ్డూను తయారు చేసి ఇచ్చారు. పాపగల్ తదితర గ్రామాల్లో గణనాథులను నిమజ్జానానికి తీసుకెళ్లారు. ● తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండలో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గురుప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, సుమంత్‌కుమార్, నరసింహారెడ్డి, శ్రవణ్ కుమార్, పాపిరెడ్డి ఉన్నారు. ● అమ్రాబాద్‌లోని అమరేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తిప్పర్తి శ్రీనివాస్, పూజారి శ్రీకుమార్‌శర్మ, కమిటీ సభ్యులు పోలా సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు. ● పెద్దకొత్తపల్లిలోని శివాంజనేయస్వామి ఆలయం దగ్గర గణేష్ యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. 10 కిలోల లడ్డూను లాటరీ పద్ధతిలో గ్రామానికి చెందిన రాగుల మాధవీర వీందర్‌రెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో గణేష్ యువక బృందం సభ్యులు రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సందు పరమేశ్వర్, అశోక్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ గణపతి పూజలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్


తాడూరు : సిర్సవాడలో గణనాథునికి 5కిలోల లడ్డూను తయారు చేసి ఇచ్చిన మహమ్మద్ జాంగీర్


తిమ్మాజిపేట : గుమ్మకొండలో నిమజ్జనానికి బయల్దేరిన వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పెద్దకొత్తపల్లిలో నిమజ్జనానికి తరలిస్తూ...


అమ్రాబాద్‌లోని అమరేశ్వర ఆలయం వద్ద ..

మాజీ ఎమ్మెల్యే బీరం జన్మదిన వేడుకలు

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కొల్లాపూర్‌లో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలో మోటార్ బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. కొల్లాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో హర్షవర్ధన్‌రెడ్డి జన్మది న వేడుక లను ఆ పార్టీ శ్రేణులు నిర్వహించి కేక్ కట్ చేశారు.


కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పెద్దకొత్తపల్లిలో ...

పెద్దకొత్తపల్లి : మండల కేంద్రంలో కొల్లాపూర్ మాజీ శాసన సభ్యులు బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హర్షన్న, యువసేన తాలూకా నాయకులు రవినాయక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్‌హెచ్ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య, మండల నాయకులు బంట్రోతు శ్రీనివాసులు, రాముయాదవ్, కొండ శ్రీనుయాదవ్, రమేష్‌రెడ్డి, వసంతం స్వామియాదవ్, రాజశేఖర్, బండిరవి, ఏదుల కుర్మయ్య, యాదగిరి, కొనమౌని నాగరాజు, బిజినేపల్లి ఈశ్వరయ్య, మోహన్‌రెడ్డి, బాబురావు, సుగుణాకర్‌రెడ్డి, ఎం.మల్లేష్, పి.శివ, పవన్‌కుమార్, శివకుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న ప్రధాని మోదీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ ప్రధాని అని చెప్పుకుంటూ బీసీ రిజర్వేషన్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అడ్డుపడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పరుస్తూ ఎన్నికలు నిర్వహించాలని కొల్లాపూర్ మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల కమిటీ నాయకుడు ఎండీ సలీం అధ్యక్షతన పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని ముందుకు వస్తే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు అడ్డుపడుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శివవర్మ, మండల కమిటీ సభ్యులు బాలపీరు, కిరణ్ కుమార్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు

తప్పుల తడకగా ఓటరు జాబితా

ఊర్కొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తప్పుల తడకగా ఓటరు జాబితాను తయారు చేసిన అధికారుల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదమా... నాయకుల కనుసన్నల్లో జాబితాను తయారు చేశారా అని పలువురు చర్చించుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాలు తిమ్మన్నపల్లి, ఊర్కొండపేట, రాచాలపల్లి, బొమ్మరాజుపల్లి, జకినాలపల్లి తదితర గ్రామాల్లో ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులను ఒకే వార్డులో పెట్టాల్సిన అధికారులు రెండు మూడు వార్డుల్లో వారి పేర్లు వచ్చేటట్లు చేయడంలో అంతర్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలా చేయడం వల్ల కొందరికి లబ్ధి చేకూర్చడానికి ఇలాంటివి చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆడపిల్ల వివాహం జరిగి అత్తవారింటికి వెళ్లిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండటం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండుచోట్ల ఓటును వినియోగించే అవకాశం ఉందని అలాంటి వారి వల్ల అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు.

నేడు తీగలపల్లిలో రిలే నిరాహార దీక్ష

కోడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ లిఫ్టు రెండులో వెళ్లి గ్రామ రైతులు భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తీగలపల్లి వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయ ర్‌లో భూములు కోల్పోయిన సమారు పదేళ్లు కావస్తున్నా భూ నిర్వాసితులకు నేటికీ నష్టపరిహారం చెల్లించడం లేదని తెలిపారు. పరిహారం చెల్లించాలని దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ, భూ నిర్వాసితులు స్వామి, రాములు, మంతయ్య, బాలమ్మ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసన సభను విజయవంతం చేయాలి

కల్వకుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ సాధన కోసం సోమవారం హైదరాబాద్‌లోని బస్ భవన్ ఆర్టీసీ ఎక్స్ రోడ్డులో జరిగే సీపీఎస్ ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు కోరారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్ విధానా న్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో టీజీఈజేఏసీ డివిజన్ చైర్మన్ సురేష్ గౌడ్, నాయకులు రాజేష్‌కుమార్, రాజేందర్, నెహ్రూప్రసాద్, కృష్ణారెడ్డి, జమీల్ అహ్మద్, సందీప్ కుమార్, వెంకటయ్య ఉన్నారు.


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కొల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్‌కమిటీ (టీఈజేఏసీ) కొల్లాపూర్ డివిజన్ చైర్మన్ జీకే వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీన జరగబోయే నిరసన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, కార్మిక, పెన్షనర్లు, ఉద్యోగస్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో ఇమ్మాన్యుయేల్, టీజీఈజేఏసీ కోచైర్మన్ శంకర్, సీపీఎస్ మండల అధ్యక్షుడు బృంగి కృష్ణప్రసాద్, టీజీఈజేఏసీ కోచైర్మన్ వరప్రసాద్, వెంకటేశ్వర్లు, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై ఆగ్రహం

కందనూలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బిహార్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ర్యాలీలో ప్రధాని మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని నాయకులు ప్రశ్నించారు. జిల్లాలో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీలు చేపట్టి, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడ లిలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


నాగర్‌కర్నూల్ బస్టాండ్ కూడలిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రధానికి క్షమాపణ చెప్పాలి

కల్వకుర్తి : ప్రధాని మోదీ తల్లిని దూషించిన రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ డిమాం డ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాం.దీ దిష్టిబొమ్మను కల్వకుర్తిలో బీజేపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబీదేవ్, బోడ నరసింహ, రాంభూపాల్‌రెడ్డి, రాఘవేంద ర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, చందు, శివకుమార్, వెంకటేశ్‌యాదవ్, కిరణ్‌కుమార్‌యాదవ్, శ్రీకాంత్, నరసింహ పాల్గొన్నారు.


కల్వకుర్తిలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో ..

వెల్దండ : హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు నిరసన చేసి, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు బోడ నర్సింహ, జంగయ్యాయాదవ్, రామస్వామి, శ్రీనివాసాచారి, బాలస్వామి, శివప్రసాద్, సుబ్బయ్యగౌడ్, పరమేష్, సురేష్‌రెడ్డి, అనిల్, శ్రీశైలం, సైదులు, ఈశ్వర్ ఉన్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌ను తిలకించిన బీజేపీ నాయకులు

కందనూలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 125వ మన్‌కీ బాత్ (మనస్సులో మాట) కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారితో పాటు నాయకులు తిలకించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అతినారపు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు జిల్లా ఎన్నికల కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు శ్రీశైలం, టౌన్ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్, ఎలిమే రాము పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

- అచ్చంపేటలో బీఆర్ఎస్ పార్టీకి షాక్

అచ్చంపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ కిషన్, సీనియర్ నాయకులు 30మంది ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాకప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరామని మాజీ సర్పంచ్ కిషన్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ వీడినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీని కాపాడుకోవడానికి పలు ప్రయత్నాలు చేస్తున్న కార్యకర్తలు, సీనియర్లు పార్టీకి షాకిస్తూ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారు.


అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు

అచ్చంపేట గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

- మాజీ ఎమ్మెల్యే గువ్వల

ఉప్పునుంతల, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో అచ్చంపేట గడ్డపై బీజేపీ జెండా ఎగురుతుందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండల సరిధిలోని రాయిచేడు గ్రామంలో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన ఇంజమూరి తిరుపతి, ఎత్తపు మధు, సొంట తిరుపతయ్య, చందన్‌సింగ్, అభిషేక్‌సింగ్, జూలూరి మహేష్, గొడుగు అశోక్, బాలరాజు, నాగరాజు, విఘ్నేశ్వర్, కృష్ణ, చింటూ, బాలుయాదయ్, తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీజేపీలో చేశారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, ఎల్లప్పుడూ మీకు తోడుగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికాంత్, ఆనంద్, అంజి, జగదీష్, రవి, దుర్గాసింగ్, చంద్రమౌళి, సంజయ్, శ్రీను, మల్లేష్, రాము, అనిల్ ఉన్నారు.


వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి బీజేపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

బ్రిడ్జి నిర్మాణంతో తప్పిన తిప్పలు


లింగసానిపల్లి ప్రధాన రహదారిలో బ్రిడ్జిపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

- 8 గ్రామాల ప్రజల స్వప్నం సాకారం

బిజినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగసానిపల్లి గ్రామ ప్రధాన రహదారిపై దాదాపు రూ.1.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో వరద సమయంలో రాకపోకలకు తిప్పలు తప్పాయని లింగసానిపల్లి, వసంతాపూర్, తుమ్మలసూగూర్, పోతిరెడ్డిపల్లి, యత్మతాపూర్, పర్వతాయిపల్లి, కార్కొండ, కుమ్మెర, గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. చిరకాల స్వప్నం సాకారమైందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు ఆదివారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాలెం చెరువు అలుగు వరద లింగసానిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్నా బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నామని గ్రామస్థులు సంబురాలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అల్లోజీ, తిరుపతయ్య, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోవిందు, జగదీష్ ఉన్నారు.

రూ. 1,65,000కు లడ్డూ వేలం

అచ్చంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాలను ఐదో రోజు నిమజ్జనం చేశారు. లడ్డూ ప్రసాదంతో పాటు వస్త్రాలు స్వామి సన్నిధిలో ఉన్న పూజ సామగ్రికి వేలం వేశారు. ఈ ఏడాది పట్టణంలో అత్యధికంగా న్యూ వెంకటేశ్వర కాలనీలోని గణేష్ ఉత్సవ కమిటీ వారు నిర్వహించిన స్వామి వారి లడ్డూ వేలం పాట రూ. లక్షా 65వేలకు కాలనీకి చెందిన పొకలకారు రామోజీ దక్కించుకున్నారు. మూడేళ్లుగా ఈయనే వేలం పాటలో లడ్డూను దక్కించుకుంటున్నారు. గత ఏడాది కంటే రూ.45వేలు అదనంగా వేలం పాడి స్వామివారి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు.


లడ్డూ దక్కించుకున్న రామోజీని శాలువాతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లెల గ్రామంలో నాప రాములమ్మ, సి.పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయా న్ని సమకూర్చగా ఆదివారం బాధిత కుటుంబాలను మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, స్థానిక నాయకులతో కలిసి ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాండుగౌడ్, నాయకులు ఆంజనేయులు, ముత్యాల రమేష్, ఆనంద్, నరేష్, విష్ణు, మల్లయ్య, వెంటకయ్య, ఆంజనేయులు,యాదయ్య, ఈదయ్య తదితరులు ఉన్నారు.